సాక్షి ప్రకాశం

ఆదివారం । 30 । మార్చి । 2025



రాని వేతనాలు.. భారంగా పోషణ

జిల్లాలోని 18 వైద్యశాలల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సుమారు 200 మంది పారిశుధ్య కార్మికులు వేతనాలు అందక అవస్థపడుతున్నారు. - 8లో..



మిర్చి కూలీల ఆటో బోల్తా

మిర్చి కోతకు కూలీలు వెళ్తున్న ఆటో బోల్తాపడి 14 మందికి గాయాలయ్యాయి. వారిలో డ్రైవర్, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
38.2/27

వాతావరణం

ఉదయం పొగమంచు ఎక్కువగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ తీవ్రత, ఉక్కపోత ఉంటుంది.



న్యూస్‌రీల్

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

ఒంగోలు సిటీ: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, ఒంగోలు నియోజకవర్గాల ఇన్‌చార్జులు అన్నా రాంబాబు, కేపీ నాగార్జున రెడ్డి, దద్దాల నారాయణయాదవ్, చుండూరు రవిబాబు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ భగవంతుడి ఆశీసులతో పాడిపంటలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, సుఖసంతోషాలతో గడపాలని వారు ఆకాంక్షించారు.

వైఎస్సార్ సీపీ అధ్యక్షుల నియామకం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం అసెంబ్లీ నియోజకవర్గాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగినట్లు వెల్లడించింది. గిద్దలూరు నియోజకవర్గ అధ్యక్షునిగా బంగారు విశ్వరూపం, కనిగిరి నియోజకవర్గ అధ్యక్షునిగా ఎకుల వెంకట సుబ్బారెడ్డి, దర్శి నియోజకవర్గ అధ్యక్షునిగా రావులపల్లి గురుప్రసాద్, కొండపి నియోజకవర్గ అధ్యక్షునిగా పెట్లూరి కృష్ణమూర్తి, మార్కాపురం నియోజకవర్గ అధ్యక్షునిగా టి.రాగారెడ్డి, ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షునిగా పెట్లూరి ప్రసాద్‌ను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

సెలవుల్లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

ఒంగోలు సబర్బన్: ప్రకాశం జిల్లా విద్యుత్ వినియోగదారులు సెలవు రోజుల్లో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు పనిచేస్తాయని ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 30వ తేదీ ఆదివారంతో పాటు ఉగాది పండుగ సందర్భంగా సెలవు అయినప్పటికీ బిల్లులు కట్టించుకునేందుకు విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల కౌంటర్లు పనిచేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. అదేవిధంగా సోమవారం రంజాన్ పండుగ రోజు కూడా కార్యాలయాలు పనిచేస్తాయని వెల్లడించారు. జిల్లాలో విద్యుత్ బిల్లులు కట్టించుకునే అన్ని కౌంటర్లు ఓపెన్‌గా ఉంటాయన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. విద్యుత్ బిల్లులను ఫోన్ పే, డిపార్ట్‌మెంట్ యాప్ ద్వారా కూడా చెల్లించవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

పోలీస్‌శాఖ 'మీ కోసం' తాత్కాలిక రద్దు

ఒంగోలు టౌన్: రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవుదినం కావడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమాన్ని సోమవారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలని, జిల్లా పోలీసు కార్యాలయానికి ఎవరూ రావద్దని కోరారు.

వేసవి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సిటీ: వేసవి సెలవుల్లో విద్యార్థులకు 42 రోజుల పాటు టెక్నికల్ ట్రైనింగ్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురం జిల్లాల్లో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాంతంలో మే 1 నుంచి జూన్ 11వ తేదీ వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఏప్రిల్ 3 నుంచి 25వ తేదీ వరకు ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో ఆన్‌లైన్ అప్లికేషన్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. మే 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, 45 సంవత్సరాల్లోపు వారు నిర్ణీత విద్యార్హతలు ఉన్నావారు మాత్రమే అర్హులన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు కాపీని విద్యార్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో డీఈఓ కార్యాలయంలో అందించాలని కోరారు.

మన(వ)సంత గానం



ఒంగోలులో చిన్నారుల ఉగాది సంబరాలు – సాక్షి, ఒంగోలు

జీవిత గమనం.. జీవన తరంగం
దుఃఖం.. సంతోషం.. ఆనందం..
అవమానం.. విరోధం.. శత్రుత్వం
పగ.. ద్వేషం.. అనుమానం..
ఇలా ఎన్నో రకాల భావోద్వేగాల మిళితం ఈ జీవితం..
వాటికి ప్రతిబింబం షడ్రుచుల ఉగాది పచ్చడి
ఒకే వంటకంలో అన్ని రుచులు..
అన్ని భావనలు.. మరెన్నో సంకేతాలు
శిశిర రుతువులో ఆకురాలింది
వసంత రుతువులో ప్రకృతి చిగురించింది
కోయిల కూసింది..
నూతన ఉత్సాహం ఉరకలెత్తింది
తెలుగువారి విశ్వావసు నామ సంవత్సరానికి
ఆరంభం ఉగాది
సాక్షి పాఠకులకు కొత్త అనుభూతులు పంచాలి...

'బంగారు బాల్యం'కు స్కోచ్ అవార్డు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో అమలవుతున్న బంగారు బాల్యం కార్యక్రమానికి ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు దక్కింది. శనివారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్కోచ్ నిర్వాహకుల చేతుల మీదుగా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఈ అవార్డు అందుకున్నారు. తద్వారా యావత్ దేశాన్ని 'బంగారు బాల్యం' ఆకర్షించింది. జిల్లా బాధ్యతలు చేపట్టిన తర్వాత పశ్చిమ ప్రాంతంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతుండటాన్ని కలెక్టర్ గమనించారు. బాలికలలో పోషకాహార లోపాన్ని కూడా గుర్తించారు. ఒంగోలులోని బాలసదన్, శిశుగృహలను సందర్శించి అనాథ పిల్లలను చూసి చలించిపోయారు. బాల్య వివాహాలలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్న జిల్లాను ఈ రుగ్మతతోపాటు పోషకాహార లోపం నుంచి, బాల కార్మిక సమస్యల నుంచి విడిపించి ప్రతి బిడ్డ బాల్యాన్ని బంగారుమయం చేయాలనే లక్ష్యంతో 'బంగారు బాల్యం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. గతేడాది ఆగస్టు 29న బంగారు బాల్యం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించగా, ప్రస్తుతం స్కోచ్ అవార్డుకు ఎంపికైంది.


ఢిల్లీలో స్కోచ్ అవార్డు అందుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తడారుతున్న గొంతులు..

పొలాల్లో కన్నీళ్లు!

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

వేసవి కాలం ప్రారంభంలోనే గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు ఆరంభమయ్యాయి. భూగర్భజలాలు భారీగా పడిపోతున్నాయి. పశ్చిమ ప్రకాశంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పల్లెల్లో చేతిపంపులు పనిచేయకపోవడంతో తాగునీటికి వ్యవసాయ బోర్లపైనే ఆధారపడుతూ వచ్చారు. భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో అవి కూడా ఒట్టిపోతున్నాయి. పంటల సాగుకు సైతం అవస్థలు తప్పడం లేదు. అధికారులకు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో దాహార్తితో ప్రజలు హాహాకారాలు చేస్తున్నారు. జిల్లాకు సాగర్ జలాలు తీసుకురావడంలో పాలకపక్షం ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం కారణంగానే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇప్పుడే పరిస్థితులు ఇలా ఉంటే.. రానున్న నాలుగు నెలల కాలం ఎలా అంటూ అన్నదాతలు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రాచర్ల మండలంలోని చిన్నగానిపల్లె, అక్కపల్లె గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఈ రెండు గ్రామాల్లో 700 వరకూ వ్యవసాయ బోర్లు ఉండగా, 500 బోర్లకు ప్రస్తుతం భూగర్భ జలాలు అందడం లేదు. దాదాపు ఏడు వందల అడుగుల లోతున్న వ్యవసాయ బోర్లకే భూగర్భ జలాలు అడుగంటడంతో నీళ్లు లేక పంట దిగుబడులు తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ బోర్ల కింద మొక్కజొన్న, మిరప పంటలను రైతులు సాగు చేస్తున్నారు. పుష్కలంగా సాగునీరు అందుబాటులో ఉంటే ఎకరాకు మూడు టన్నుల మొక్కజొన్న దిగుబడి వస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో దిగుబడి దారుణంగా పడిపోయి రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. చిన్నగానిపల్లెలో సింగిల్ ఫేజ్ మోటార్లు 11 ఉండగా, 5 మాత్రమే పనిచేస్తున్నాయి. అలాగే, అక్కపల్లెలో 4 సింగిల్ ఫేజ్ మోటార్లు ఉండగా, రెండు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. దీంతో నీళ్లు రాక తాగునీటి కోసం గ్రామస్తులు అల్లాడుతున్నారు.

- వేసవి ప్రారంభంలోనే పడిపోతున్న భూగర్భ జలాలు
- ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో తాగునీటి అవస్థలు
- సాగర్ జలాలు తెచ్చుకోవడంలో పాలకుల వైఫల్యం
- నీళ్లు లేక బీటలు వారుతున్న పొలాలు
- దాహార్తితో అల్లాడుతున్న గ్రామాలు
- జిల్లాలో ఒట్టిపోతున్న బావులు, బోర్లు
- ఇప్పటికే 93 గ్రామాల్లో ప్రమాద ఘంటికలు
- తాగునీటి కోసం రోడ్డెక్కుతున్న మహిళలు


రాచర్ల మండలంలో ఒట్టిపోయిన బోరు, బీడుగా మారిన పంట పొలం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలోని 729 గ్రామ పంచాయతీల్లో మొత్తం 17,692 తాగునీటి బోర్లున్నాయి. వీటిలో రెండు వేలకుపైగా అప్పుడే ఎండిపోయాయి. రక్షిత మంచినీటి పథకాల్లో చాలా వరకు నిరుపయోగంగా మారాయి. పశ్చిమ ప్రాంతంలోని చేతి పంపుల్లో పూడికతీసినా నీళ్లు రావడం లేదు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలు సిద్ధం చేశామంటూ మంత్రులు, జిల్లా అధికారులు ఊదరగొడుతున్నా.. అవి పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చకపోవడంతో దాహం కేకలు వినిపించే పరిస్థితులు తలెత్తాయి.

ప్రణాళిక బారెడు.. అమలు మూరెడు...

జిల్లాలో తీవ్ర నీటి ఎద్దడి ఉన్న 57 గ్రామాలను గుర్తించిన అధికారులు ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నారు. మొత్తం 9 మండలాల్లో దాహార్తి తీర్చేందుకు 123 గ్రామాలకు మంచినీటిని ట్యాంకర్ల ద్వారా అందించాలని నిర్ణయించారు. అయితే, మొదటి విడతలో 57 గ్రామాలకు మొదలు పెట్టారు. మరో 66 గ్రామాలకు మంచినీరు సరఫరా చేయాలని యోచిస్తున్నారు. ప్రతిరోజూ 116 ట్యాంకర్ల ద్వారా యర్రగొండపాలెంలోని 13 గ్రామాలు, దొనకొండలో 10, పెద్దారవీడులో 10, పుల్లలచెరువులో 6, దోర్నాల 7, మార్కాపురం 4, పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో మూడేసి, తర్లుపాడులో ఒక గ్రామానికి నీటిని పంపుతున్నారు.

నీటి కోసం రోడ్డెక్కుతున్న మహిళలు...

అటు సాగునీటి సంగతి దేవుడెరుగు.. తాగునీటిని అయినా అందించండి మహాప్రభో అంటూ పలు గ్రామాల్లో మహిళలు రోడ్డెక్కుతున్నారు. 10 నుంచి 15 రోజుల పాటు రక్షిత మంచినీటి పథకాల నుంచి నీళ్లివ్వకపోవటంతో మహిళలు, పురుషులు మూకుమ్మడిగా రోడ్డుమీదకు వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. పెద్దారవీడు మండలం పోతంపల్లి గ్రామాల ప్రజలు రహదారి మీదకు వచ్చి బైఠాయించారు. ఇదే తరహాలు అనేక గ్రామాల ప్రజలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం...

నాగార్జున సాగర్‌లో పుష్కలంగా నీరున్నా ఆ నీటిని సక్రమంగా జిల్లాకు తెచ్చుకోవడంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు వైఫల్యం చెందారు. దాంతో జిల్లాలో సాధారణ విస్తీర్ణం కంటే పంటలు తక్కువకు విస్తీర్ణానికి పడిపోయాయి. సాగర్ ఆయకట్టు కింద ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 1.80 లక్షల హెక్టార్లలో సాగు భూమి ఉంది. అయితే ఈ ఏడాది ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కేవలం 80 వేల హెక్టార్లలో కూడా రైతులు పంటలు సాగు చేయలేదు. అంటే ఆయకట్టు ఎంత దారుణంగా పడిపోయిందో అర్థమవుతోంది. ఇక, జిల్లా మొత్తం మీద 40 వేల నుంచి 45 వేల హెక్టార్లలో సాగుచేయాల్సిన వరి ఖరీఫ్, రబీ రెండు సీజన్లు కలుపుకుని ఈ ఏడాది కేవలం 23 వేల హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. శనగ 65 నుంచి 70 వేల హెక్టార్లలో సాగుచేయాల్సి ఉంటే కేవలం 24,588 హెక్టార్లలోనే సాగు చేశారు. మినుము 15 నుంచి 20 వేల హెక్టార్లలో సాగు చేయాల్సి ఉంటే.. కేవలం 12,329 హెక్టార్లలో మాత్రమే సాగు చేయాల్సిన పరిస్థితి. కంది 90 నుంచి లక్ష హెక్టార్లలో సాగు చేయాల్సి ఉంటే.. కేవలం 71,665 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. మిర్చి పరిస్థితి మరీ దారుణం. 50 నుంచి 55 వేల హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా, కేవలం 26,163 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు.


అక్కపల్లెలో భూగర్భ జలాలు అందక అర్ధగంట మాత్రమే తాగునీరు వస్తున్న మోటారు


ఒట్టిపోయిన 93 గ్రామాలు...

ఓ వైపు వెంటాడుతున్న వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు ఎండల తీవ్రత పెరుగుతుండటం జిల్లాలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి పడిపోవటానికి కారణాలుగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే పశ్చిమ ప్రకాశం జిల్లాలోనే సమస్య తీవ్రంగా ఉండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అధ్యయనంలో ఈ భయంకరమైన వాస్తవాలు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో 12 మండలాల పరిధిలోని 93 గ్రామాలు నీళ్లో రామచంద్రా అంటూ అల్లాడిపోతున్నాయి. మార్చి పూర్తికాకముందే ఈ పరిస్థితులు ఉంటే ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో పరిస్థితులు ఏ విధంగా ఉంటాయో ఊహించుకుంటేనే భయమేస్తోంది. మరో 100 గ్రామాల్లో భూగర్భ జలాల పడిపోయే పరిస్థితి ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

నాడు–నేడు సాగర్ జలాలపై నిర్లక్ష్యం...

నాగార్జున సాగర్ నీరు జిల్లాకు కేటాయించిన దానికంటే తక్కువగానే వచ్చింది. అందువలనే అటు సాగు, ఇటు తాగు నీటికి జిల్లా ప్రజలు, రైతులు కటకటలాడుతున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు 132 టీఎంసీల సాగర్ జలాల కేటాయింపు ఉంది. అందులో ప్రకాశం జిల్లాకు 39.400 టీఎంసీలు కాగా, బాపట్ల జిల్లాకు 16 టీఎంసీలు. ప్రకాశం జిల్లాకు కేటాయించిన వాటిలో సాగునీటికి 32.213 టీఎంసీలు కాగా, తాగునీటికి 7.189 టీఎంసీలు. ఈ లెక్కలు సాగర్ కుడి కాలువలో 85/3 కిలోమీటరు వద్ద తేల్చాల్సి ఉంది. అయితే, కనీసం 35 టీఎంసీలు కూడా జిల్లాకు రాలేదన్నది నిపుణుల అంచనా. సాగర్ నీటితో నింపాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకులు 98 ఉన్నాయి. వాటితో పాటు రామతీర్థం జలాశయానికి చేరిన సాగర్ జలాలను కందుకూరు ఎస్ఎస్ ట్యాంకుకు, ఒంగోలులోని రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు, మార్కాపురం, కనిగిరి ఎస్ఎస్ ట్యాంకులకు నింపాల్సి ఉంది. 2019కి ముందు కూడా ఇదే పరిస్థితి ఉండేది. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు సాగర్ జలాలను పుష్కలంగా తెప్పించడంతో ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాలేదు.

మండలాల వారీగా నీటి సమస్య ఉన్న గ్రామాలు...


చిన్నగానిపల్లెలో నీరందక నిరుపయోగంగా మారిన సింగిల్ ఫేజ్ మోటారు పంప్‌హౌస్

పుల్లలచెరువు మండలం : అయ్యగారిపల్లె, చంపలమడుగు, చిన్నపాలెం, చౌటపచ్చెర్ల, చౌటపల్లె, గారపెంట, ఇసుకత్రిపురవరం, కవకకుంట్ల, కొమరోలు, మానెపల్లె, మర్రివేముల, ముటుకుల, నరసాపురం, పుల్లలచెరువు, రాచకొండ, శతకోడు, యండ్రపల్లె.

పెద్దారవీడు మండలం : బడవీడు, బైయోడ గుంపుల, చట్లమిట్ట, కంభంపాడు, దేవరాజుగట్టు, గొబ్బూరు, ఓబులక్కపల్లె, ప్రగల్లపాడు, పెద్దారవీడు, ఎస్.కొత్తపల్లె, సానికవరం, తంగిరాలపల్లె, తోకపల్లె.

మార్కాపురం మండలం : బడేకాన్‌పేట, భూపతిపల్లె, బొందలపాడు, చింతకుంట, జమ్మనపల్లె, కోలభీమునిపాడు, మాల్యవంతునిపాడు, నికరంపల్లె, పెదనాగులవరం, తిప్పాయిపాలెం, వేములకోట.

గిద్దలూరు మండలం : చట్టిరెడ్డిపల్లె, గండికోట, కంచిపల్లె, మోడంపల్లె, ముండ్లపాడు, నరసింహునిపల్లె, సంజీవరావుపేట, తిమ్మాపురం.

యర్రగొండపాలెం మండలం : అల్లిపాలెం, అమ్మనిగుడిపాడు, బిలగండ్లపెంట, గుర్రపూసల, లింగమవానిపల్లె, మల్లంపల్లె, రామచంద్రాపురం, యర్రగొండపాలెం.

త్రిపురాంతకం మండలం : గనపవరం, లెల్లపల్లె, మాదవానిపల్లె, మెడపి, నరసింగపురం, రామసుంద్రం, విశ్వనాథపురం.

దొనకొండ మండలం : అనంతవరం, భూమనపల్లె, కొచ్చెర్లకోట, మల్లంపేట, మంగినపూడి, రుద్రసముద్రం.

దోర్నాల మండలం : చినదోర్నాల, దోర్నాల, నల్లగుంట, పెదబొమ్మలాపురం, ఎగువ చెర్లోపల్లె

ముండ్లమూరు మండలం : ఈదర, జమ్మలమడక, కంభంపాడు ఈస్ట్, కొమ్మవరం, నూజెల్లపల్లె, పూరిమెట్ల.

కంభం మండలం : కంభం, జంగంగుంట్ల, కందులాపురం, ఎల్.కోట.

కురిచేడు మండలం : ఆవులమంద, కల్లూరు, ముష్ట గంగవరం, వెస్ట్ కాశీపురం.

రాచర్ల మండలం : ఆకవీడు, చినగంజిపల్లె, చోల్లవీడు.

వ్యవసాయ బోర్లకు నీరందక దిగుబడి తగ్గింది

నాకు మూడెకరాల పొలం ఉంది. ఆ పొలంలో ఒక వ్యవసాయ మోటారు ఉంది. మూడెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. మొక్కజొన్న కంకి గట్టిపడే సమయానికి భూగర్భ జలాలు అడుగంటడంతో వ్యవసాయ బోరుబావికి నీరందక చాలా నష్టపోయాను. సాగునీరు లేకపోవడంతో ఎకరానికి కేవలం 1.5 టన్నులు మాత్రమే మొక్కజొన్న దిగుబడి వచ్చింది. భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్న వ్యవసాయ పొలాల్లో మూడు టన్నుల దిగుబడి వచ్చింది. భూగర్భ జలాలు అడుగంటడంతో వ్యవసాయ బోర్లకు నీరు రాక మొక్కజొన్న పంటకు ఆశించిన దిగుబడి రాలేదు. సాగు నీరు లేక తీవ్రంగా నష్టపోతున్నాము.



– సట్టి రంగస్వామి, రైతు, చిన్నగానిపల్లె

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

- పోక్సో కోర్టు జిల్లా న్యాయమూర్తి శైలజ

ఒంగోలు: పోక్సో చట్టంపై చిన్నారులకు అవగాహన అవసరమని పోక్సో కోర్టు జిల్లా న్యాయమూర్తి కె.శైలజ అన్నారు. స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో చిన్నారులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2012లో పోక్సో చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. ఇది చిన్నారులకు ఎంతో రక్షణగా నిలుస్తోందన్నారు. 18 సంవత్సరాల్లోపు పిల్లలపై లైంగిక దాడి, వేధింపులు, చిత్రహింసలు వంటి నేరాలకు కఠినమైన శిక్షలను ఈ చట్టం ద్వారా విధించడం జరుగుతుందన్నారు. చిన్నారులకు న్యాయం చేసేందుకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటుచేసి వేగంగా విచారణ చేపట్టేందుకు ప్రత్యేక ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు తెలిపారు. నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షలు కూడా విధించే అవకాశం ఉందన్నారు. పిల్లల భద్రత ప్రతిఒక్కరి బాధ్యతని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, పోలీసుశాఖలు ఈ చట్టం గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని శైలజ సూచించారు. పిల్లల భద్రతకు సంబంధించి ఏవైనా అనుమానాస్పద ఘటనలు జరిగితే వెంటనే చైల్డ్ లైన్ (1098) లేదా స్థానిక పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే సమాజంలో పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను పూర్తిగా అరికట్టగలమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సుధారాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోక్సో కోర్టు జిల్లా న్యాయమూర్తి శైలజ

ఏప్రిల్ 6న రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

మార్కాపురం: మండలంలోని బొడిచర్ల గ్రామంలో శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 6వ తేదీ రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.45 వేలు, రూ.35 వేలు, రూ.20,116, నాలుగు, ఐదు బహుమతులుగా రూ.10 వేలు, రూ.5 వేలు అందించనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనే వారు 6వ తేదీ ఉదయం 7.30 గంటల్లోగా కమిటీ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 98491 79311, 99663 02127 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రాని వేతనాలు.. భారంగా పోషణ

- 18 వైద్యశాలల్లో సుమారు 200 మంది సిబ్బంది
- ఐదు నెలలుగా శానిటరీ కార్మికులకు అందని వేతనాలు
- కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికుల ఆవేదన

కంభం: ఏళ్ల తరబడి ప్రభుత్వ వైద్యశాలల్లో ఔట్‌సోర్సింగ్ శానిటరీ కార్మికులుగా పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు సక్రమంగా ఇవ్వక పోవడంతో వారి కుటుంబాలు దుర్భర జీవితాలు గడుపుతున్నాయి. వచ్చే అరకొర జీతాలు కూడా నెలనెలా ఇవ్వకుంటే తమ కుటుంబ పోషణ ఎలా, పిల్లలను పోషించుకునేది ఎలా..అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిరుద్యోగుల కష్టాలు వర్ణనాతీంగా మారిపోతున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 18 ప్రభుత్వ వైద్యశాలల్లో సుమారు 200 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తుండగా వారికి మార్చితో కలిపితే 5 నెలలకు సంబంధించిన జీతాలు రావాల్సి ఉంది. జిల్లా అధికారులకు అడిగితే వచ్చే వారం వస్తాయంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా జీతాలు విడుదల కావడం లేదు. రెగ్యులర్ ఉద్యోగులు నాలుగు రోజులు జీతం ఆలస్యంగా వస్తే నానా హైరానా పడతారు. అటువంటిది 5 నెలలుగా జీతాలు రాకుంటే తామెలా బతకాలని, కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 18 వైద్యశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 18 వైద్యశాలల్లో సుమారు 200 మంది పారిశుధ్య కార్మికులున్నారు. కంభం, గిద్దలూరు, దోర్నాల, యరగొండపాలెం, పామూరు, కనిగిరి, పొదిలి, కొండపి, చీమకుర్తి, ఒంగోలు, మార్కాపురం ఇంకా కొన్ని వైద్యశాలల్లో వీరంతా విధులు నిర్వహిస్తున్నారు. 30 పడకల వైద్యశాలలో 9 మంది, 50 పడకల వైద్యశాలలో 13 మంది, ఏరియా వైద్యశాలలో ముగ్గురు చొప్పున ఉంటారు. వీరందరికీ థర్డ్ పార్టీ ఏజెన్సీతో జీతాలు చెల్లిస్తుంటారు. శానిటరీ పనిచేసే సిబ్బందికి రూ.11,858, సూపర్‌వైజర్లకు రూ.13,500 జీతం ఉంది. ప్రస్తుతం వీరందరికీ సుమారు 6 నెలల జీతాలు రావాల్సి ఉంది.


ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

రోజూ క్రమం తప్పకుండా విధులకు హాజరవుతున్న వీరికి జీతాలు చెల్లించక పోవడంపై వైద్యశాలకు వచ్చే ప్రజలు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్యమే కీలకం

వైద్యశాలలో పరిశుభ్ర వాతావరణం ఉండటం ఎంతో ముఖ్యం. వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచితే రోగులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తూ టాయిలెట్స్, బాత్రూమ్స్ శుభ్రం చేస్తూ ఉండటంతో రోగాలు ఇతరులకు వ్యాపించకుండా ఉంటాయి. ఒక్కరోజు సిబ్బంది పనులకు గైర్హాజరైతే పరిస్థితి ఎంతదారుణంగా ఉంటుందో తెలిసిందే. వైద్యశాలలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే పిలిచి మందలించే అధికారులు తమకు జీతాలు రాని విషయాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని కార్మికులు వాపోతున్నారు. ప్రతి నెలా జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పీఎఫ్ డబ్బులు కూడా పడటం లేదు

వైద్యశాలల్లో పనిచేసే శానిటరీ సూపర్‌వైజర్‌కు జీతం రూ.16 వేలుకాగా పీఎఫ్ ఇతర కటింగ్‌లు పోనూ రూ.13,050, స్వీపర్లకు జీతం రూ.13,500కాగా కటింగ్‌లు పోనూ రూ.11,858 ఖాతాల్లో జమవుతాయి. గతంలో పీఎఫ్ డబ్బులు ప్రతినెలా తమ ఖాతాల్లో జమ అయ్యేవని, సుమారు ఏడాది నుంచి తమ పీఎఫ్ డబ్బులు తమ ఖాతాల్లో జమ కావడం లేదని కార్మికులు వాపోతున్నారు. ఎవరిని అడిగినా స్పందించడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి జీతాలతో పాటు పీఎఫ్ డబ్బులు ప్రతి నెలా ఖాతాల్లో జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సరుకులు కూడా అప్పు ఇవ్వడం లేదు:


ఏడేళ్లుగా పనిచేస్తున్నా. నాకు భర్త లేడు. ఇద్దరు పిల్లలున్నారు. నెలనెలా జీతాలు ఇవ్వక పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. చిల్లర కొట్లలో సరుకులు కూడా అప్పు ఇవ్వడం లేదు. ఐదు నెలలకోసారి కూడా జీతాలు ఇవ్వకుంటే ఎలా బతకాలి.
– కాశమ్మ, స్వీపర్

ఎప్పుడిస్తారో తెలియడం లేదు:


నేను ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నా. నాకు వచ్చే జీతం డబ్బులతోనే నా కుటుంబ పోషణ జరగాలి. జీతం ఎప్పుడు ఇస్తారో ఎవరూ చెప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి మాకు నెలనెలా జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలి.
– ఎస్.సువర్ణ, స్వీపర్, కంభం ప్రభుత్వ వైద్యశాల

వచ్చే నెల ఇస్తామని చెబుతున్నారు:


నేను ప్రభుత్వ వైద్యశాలలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నా. మాకు ఈ నెలతో కలిపి 5 నెలల జీతం రావాలి. జిల్లా సూపర్‌వైజర్‌ను అడిగితే వచ్చే నెల మొదటి వారంలో కొంత నగదు వేస్తామని చెబుతున్నారు. పీఎఫ్ డబ్బులు కూడా మా ఖాతాల్లో సక్రమంగా జమ కావడం లేదు.
– కె.రామారావు, సూపర్‌వైజర్, కంభం

జీతాలు వచ్చే నెల మొదటి వారంలో పడతాయి:

రెండు నెలల జీతాలు ఏప్రిల్ మొదటి వారంలో పడే అవకాశం ఉంది. పీఎఫ్ డబ్బులు కొంతమందికి అకౌంట్లలో పడుతున్నాయి. రాని వారు మరోసారి చూసుకొని వివరాలు చెబితే పరిశీలిస్తాం.
– మహేష్, జిల్లా సూపర్‌వైజర్


ఒంగోలు సిటీ: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ చిత్రపటానికి శనివారం ఒంగోలులోని ఆయన నివాసంలో శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యేలు టీజేఆర్ సుధాకర్‌బాబు, చిర్ల జగ్గిరెడ్డితో పాటు పలు జిల్లాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు. చిత్రంలో వైవీ సుబ్బారెడ్డి సోదరుడు వైవీ భద్రారెడ్డి ఉన్నారు.



జైలును శిక్షణాలయంగా మల్చుకోవాలి

- జిల్లా జడ్జి భారతి

దర్శి: జైలును శిక్షాలయంగా కాకుండా శిక్షణాలయంగా మల్చుకోవాలని జిల్లా జడ్జి ఏ.భారతి అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఖైదీలకు పెడుతున్న ఆహారం, వసతులు పరిశీలించారు. వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో భారతి మాట్లాడుతూ క్షణకాలిక ఆవేశంలో చేసిన తప్పులకు జైలుకు వస్తారని, చేసిన తప్పులు తెలుసుకుని మళ్లీ అటువంటి తప్పులు జరగకుండా చూసుకోవాలన్నారు. తప్పులు చేసి శిక్షలు పడి జైలుకు వస్తే కుటుంబాల పరువుపోతుందని, పిల్లలు కూడా సమాజంలో తలెత్తుకుని తిరగలేక చిన్నబోతారన్నారు, ఒంగోలు, దర్శి సీనియర్ సివిల్ జడ్జిలు కె.హేమలత, ఎస్.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ జైలులో తమ జీవితంలో చేసిన తప్పు ఒప్పులను మనన చేసుకుని తప్పులకు దూరంగా ఉండాలన్నారు. మంచి మనసుతో ఆలోచించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి కె.నిఖిత మాట్లాడుతూ జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. జీవితంలో మళ్లీ తప్పులు చేయకుండా మంచి జీవనాన్ని కొనసాగించాలని సూచించారు. జైలు సూపరింటెండెంట్ వెంకటరమణ, న్యాయవాదులు ఆదినారాయణ, ఎన్.సుబ్బారెడ్డి, పి. మనోహరమ్మ పాల్గొన్నారు.


ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న జిల్లా జడ్జి భారతి

హజ్ కమిటీ నిధులతో ఇఫ్తార్ విందులా?

- ముస్లింలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- సోషల్ డెమోక్రటిక్ పార్టీ నేత అబ్దుల్ సత్తార్

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు ఇస్తున్న ఇఫ్తార్ విందులకు రాష్ట్ర హజ్ కమిటీ నిధుల నుంచి రీయింబర్స్‌మెంట్ పద్ధతితో 1.50 కోట్ల రుపాయలు ఖర్చు చేయడం దారుణమని సోషల్ డెమెక్రటిక్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్ అబ్దుల్ సత్తార్ విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయవాడలో నిర్వహించిన విందులో ఒక్కొక్కరికి 3,750 రుపాయల చొప్పున మొత్తం 2 వేల మందికి 75 లక్షల రుపాయలు ఖర్చు చేయడం, మిగిలిన అన్ని జిల్లాలకు కలిపి 75 లక్షల రుపాయలు ఖర్చు చేయడం వెనక వున్న మతలబు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ఒక్కొక్కరికి 3,750 ఖర్చు చేయాల్సిన అవసరమేమిటో అర్థం కావట్లేదన్నారు. ఇఫ్తార్ విందు కోసం 1.50 కోట్ల రుపాయలు కేటాయించలేని కూటమి ప్రభుత్వం ఇక ముస్లింల సంక్షేమం కోసం పాటుపడుతుందని చెబితే ఎలా నమ్మాలో అర్థం కావట్లేదన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నట్లు ఇఫ్తార్ విందులో చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, వక్ఫ్ సవరణ బిల్లు గురించి మాత్రం నోరు మెదపకుండానే ముస్లిం దృష్టి మరల్చే ప్రయత్నాలు చేశారని మండిపడ్డారు. ఒకవైపు వక్ఫ్ ఆస్తుల ఆక్రమదారులకు రక్షణగా కేంద్ర ప్రభుత్వం బిల్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుంటే ఆ కేంద్ర ప్రభుత్వాన్ని తన భుజాల మీద మోస్తున్న చంద్రబాబు మాత్రం వక్ఫ్ బిల్లు గురించి స్పష్టమైన వైఖరి ప్రకటించకుండా వక్ఫ్ ఆస్తులను కాపాడుతానని చెప్పడం మసిపూసి మారేడు కాయ చేయడమేనన్నారు. సీఎం మాటలనను ముస్లింలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు రెండేళ్లుగా విజయవాడ విమానాశ్రయం ఎంబార్కేషన్‌గా ఉందని, ఇప్పుడు దాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తే చంద్రబాబు నోరు విప్పి మాట్లాడడం లేదన్నారు. నేటి పరిస్థితులను వదిలి పెట్టి హైదరాబాద్ హజ్ హౌస్ పాత చింతకాయ పచ్చడి గురించి గొప్పలు చెప్పడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో కూడా ముస్లిం సమాజానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా దగా చేస్తోందని మండిపడ్డారు. ఎమ్మెల్సీలకు ఎన్నికల్లో కనీసం ఒక్క స్థానాన్ని కూడా ముస్లింలకు కేటాయించలేదని, మార్కెట్ యార్డు పదవుల్లో కూడా కూటమి ప్రభుత్వం ముస్లింలను దూరం పెట్టిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించి చిత్తశుద్ధిగా పనిచేయాలని అబ్దుల్ సత్తార్ కోరారు.

మనవరాలి జన్మదిన వేడుకలకెళ్లి..

- తిరిగొస్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం
- దుర్ఘటనలో ఇద్దరి మృతి
- నలుగురికి గాయాలు

వరికుంటపాడు: మనవరాలి జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా జరుపుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా నలుగురు గాయపడిన ఘటన వరికుంటపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం తెల్లవారు జామున జరిగింది. ఎస్సై రఘునాథ్ వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పెద్దచెర్లోపల్లి మండలం పెద్దబొట్టుపల్లికి చెందిన బట్టి యోగయ్య, కొండమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలున్నారు. ఈ క్రమంలో కలువాయి మండలం చీపినాపిలో ఉన్న రెండో కుమార్తె కూతురి మొదటి జన్మదిన వేడుకలకు తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో శుక్రవారం మధ్యాహ్నం వెళ్లారు. అక్కడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి స్వగ్రామానికి తిరిగి శనివారం తెల్లవారు జామున బయల్దేరారు. వరికుంటపాడు హైవేపై స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి అనంతపురం జిల్లా కదిరి వెళ్తున్న మినీ బోలెరో.. కారును ఢీకొంది. ఆ సమయంలో అందులో చిన్నారి మినహా మిగిలిన ఆరుగురూ గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గుర్ని ప్రకాశం జిల్లా పామూరుకు, మిగిలిన వారిని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు 108లో తరలించారు. పామూరు వైద్యశాలలో బోనం వీరబ్రహ్మం (19), ఉదయగిరిలోని ఆస్పత్రిలో బట్టి కొండమ్మ (50) మృతి చెందారు. యోగయ్య, ఆయన కుమార్తెలు పెదయోగమ్మ, చిన్నయోగమ్మ, కారు డ్రైవర్ చొప్పరపు నవీన్ గాయపడ్డారు. మృతదేహాలకు ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టాన్ని నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నుజ్జునుజ్జయిన వాహనాలు



విగతజీవులుగా వీరబ్రహ్మం, కొండమ్మ

పీసీపల్లి: మృతుల స్వగ్రామం బొట్టుపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అప్పటి వరకూ చిట్టితల్లి..అంటూ మనవరాలిని ఆడించిన నానమ్మ మృతి చెందిన చెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తర్లుపాడు: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని తుమ్మలచెరువులో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పఠాన్ మదార్‌వలి (39) శుక్రవారం రాత్రి పురుగుమందు తాగడంతో కుటుంబ సభ్యులు గుర్తించి హుటాహుటిన మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన శనివారం మృతి చెందారు. మృతదేహాన్ని ఎస్సై బ్రహ్మనాయుడు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


మదార్‌వలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

పల్లెవనం పార్కుకు మంటలు

దర్శి: పట్టణంలోని పల్లె వనం పార్కుకు శనివారం మంటలంటుకున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రి పక్కనే ఉన్న చెత్తకు నిప్పు పెట్టడంతో ఆ నిప్పు కాస్తా పార్కు చుట్టూ ఉన్న కాగితం పూల చెట్లకు అంటుకుని మంటలు భారీగా ఎగిసి పడ్డాయి. దీంతో స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.


కాగితం చెట్లలో ఎగిసిపడుతున్న మంటలు

మిర్చి కూలీల ఆటో బోల్తా

- 14 మందికి గాయాలు
- ఆటోడ్రైవర్, మరో ఇద్దరి పరిస్థితి విషమం
- క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలింపు
- ఆటోలో 22 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం


బోల్తాపడిన ఆటో


గాయపడిన ఒక్కెమ్మ


వెంకటరమణ..


గుండమ్మ..


మోటారు సైకిలిస్టు భాస్కర్‌రెడ్డి..


ఆటో డ్రైవర్ శ్రీను..

ముండ్లమూరు (దర్శి): మిరపకాయలు కోసేందుకు వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడి 14 మంది గాయపడ్డారు. ఈ సంఘటన ముండ్లమూరు మండలం శింగన్నపాలెం సమీపాన శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లూరు మండలం లక్కవరం గ్రామం నుంచి ఆటోలో 14 మంది మిరపకాయలు కోసే వ్యవసాయ కూలీలు నాయుడుపాలెం బయల్దేరారు. తిరుగు ప్రయాణంలో శింగన్నపాలెం వచ్చేసరికి ఎదురుగా మోటారు సైకిల్‌పై వస్తున్న పాపిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డిని ఆటో ఢీకొంది. ఆటో రెండు పల్టీలు కొట్టి తల్లకిందులుగా తిరగబడింది. భాస్కర్‌రెడ్డితో పాటు 14 మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో ఆటోలో 22 మంది వ్యవసాయ కూలీలు ఉన్నారు. ఒక్కసారిగా ఆటో తిరగబడటంతో కూలీలంతా కేకలు పెట్టి భయాందోళనకు గురయ్యారు. కూలీలంతా చెల్లా చెదురుగా పడిపోయారు. స్థానికులు 108కు ఫోన్ చేసి క్షతగాత్రులైన ఆరుగురిని దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. స్వల్పగాయాల పాలైన మరో ఎనిమిది మందిని ఓ ప్రైవేటు వాహనంలో తూర్పు గంగవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలైన వారిలో ఆటో డ్రైవర్ శ్రీను, భాస్కర్‌రెడ్డి, లక్కవరం గ్రామానికి చెందిన గుండమ్మ, వెంకట రమణ, ఒక్కెమ్మ ఉన్నారు.

రాజీవ్ విగ్రహం తొలగింపు

- కాంగ్రెస్ పార్టీ నేతల నిరసన

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలు కబాడీపాలెం సెంటర్‌లో ఉన్న మాజీ ప్రధాని, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారాలు శనివారం రాత్రి 8 గంటల సమయంలో జేసీబీలతో తొలగించారు. విగ్రహం రోడ్డు మధ్యలో ఏర్పాటు చేశారని, ట్రాఫిక్ రద్దీ రీత్యా ఈ ప్రాంతంలో యాక్సిడెంట్‌లు జరుగుతున్నాయని, తమకు స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో తొలగించినట్లు అధికారులు తెలిపారు. విగ్రహ కమిటీలో ఉన్న ముగ్గురికి విగ్రహం కూల్చివేతపై సమాచారం అందించినట్లు అధికారులు ప్రకటించారు. విగ్రహాన్ని అదే ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల నిరసన

విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కబాడీపాలెంలోని విగ్రహం కూల్చివేసిన స్థలం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. కనీసం తమకు సమాచారం కుడా ఇవ్వకుండా విగ్రహం తొలగించడం ఏమిటని పాలపర్తి విజేష్ రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు బీఆర్ గౌస్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉంగరాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్థాయి సంఘాలపై జెడ్పీ చైర్‌పర్సన్ సమీక్ష

ఒంగోలు సిటీ: జిల్లాల స్థాయి సంఘాలైన వ్యవసాయం, విద్య, వైద్యశాఖలపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సమీక్షించారు. శనివారం జెడ్పీ సీఈఓ చిరంజీవి ఆధ్వర్యంలో జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించారు. తొలుత అజెండా ప్రకారం ఒకటి, ఏడు స్థాయి సంఘ పనులు, ఆర్థి విషయాలపై మూడు జిల్లాలకు సంబంధించిన అధికారులతో సమీక్షించారు. అనంతరం రెండో సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ, మూడు నాలుగు స్థాయి సంఘాలైన వ్యవసాయం, విద్య, వైద్యం శాఖలపై అధికారులతో సమీక్షించారు. ఐదు ఆరు స్థాయి సంఘాలైన స్త్రీ శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు చెప్పారు. స్థాయి సంఘ సమావేశాలకు ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు అన్ని శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తూ సమావేశం ముగించారు. సమావేశంలో దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి